క్లుప్తంగా

సచివాలయ భవనం ప్రారంభం

దక్షిణచిరువోలులంక(అవనిగడ్డ): మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంకలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, నూతన సీసీ రహదారులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాత సనకా కుటుంబరావును ఎమ్మెల్యే సింహాద్రి అభినందించారు.

కేడీసీసీ బ్యాంకు భవనానికి శంకుస్థాపన

చల్లపల్లి: స్థానిక భారతలక్ష్మి రైస్ మిల్లు దగ్గర కొనుగోలు చేసిన స్థలంలో శుక్రవారం రూ.కోటీ 61 లక్షల 50వేలతో నూతనంగా నిర్మించ తలపెట్టిన కేడీసీసీ బ్యాంక్ చల్లపల్లి శాఖ భవన నిర్మాణానికి కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి - కోటేశ్వరరావు దంపతులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ సీఈఓ ఎ.శ్యాంమనోహర్, ఏజీఎం జి.సూర్య ప్రకాశరావు, డైరెక్టర్ పి.సుజాత, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కేడీసీసీ బ్యాంక్ చల్లపల్లి బ్రాంచ్ మేనేజర్ యలవర్తి నగరాజ కుమారి పాల్గొన్నారు.

పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్‌లో సందేహాలొద్దు

పెడన: పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ విషయంలో ఎటువంటి సందేహాలు అవసరం లేదని, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సచివాలయాల్లోని వీఆర్వోలకు అప్పగించిందని తహసీల్దారు పి.మధుసూదనరావు అన్నారు. మండలంలోని వీఆర్వోలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు.

126 మంది విద్యార్థులకు రూ.7.73 లక్షల స్కాలర్‌షిప్

చల్లపల్లి: స్థానిక విజయా హైస్కూలులో గొర్రెపాటి ఫౌండేషన్, విజయా అకాడమీల చైర్మన్, ప్రవాస భారతీయుడు గొర్రెపాటి రంగనాధబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభావంతులైన 126 మంది పేద విద్యార్థులకు రూ.ఏడు లక్షల 73వేలు స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు చెరుకూరి కుటుంబరావు మాట్లాడుతూ రంగనాధబాబు గత 36 సంవత్సరాల్లో దాదాపు రూ.99 లక్షలు స్కాలర్‌షిప్‌లు అందించారని తెలిపారు.

బీజీకే జెడ్పీహెచ్ఎస్‌కు రూ.50వేలు వితరణ

పెడన: పట్టణంలోని భట్ట జ్ఞానకోటయ్య (బీజీకే) జెడ్పీఉన్నత పాఠశాలలో 1993-94వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్ రూ.50,001ను పాఠశాల పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ పత్రాన్ని శుక్రవారం పాఠశాల హెచ్ఎం ఎస్.ఉషకు అందజేశారు. డిపాజిట్‌పై వచ్చే వడ్డీని ప్రతి సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ఇవ్వాలని సూచించారు.

పార్టీ శ్రేణులంతా 'సిద్ధం' కావాలి

గూడూరు:వచ్చే సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 30న ఏలూరులో తలపెట్టిన సిద్ధం కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా తరలిరావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఉప్పాల రాము పిలుపునిచ్చారు. గూడూరు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఆచప విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి పదివేల మంది ఏలూరు సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, పార్టీ కన్వీనర్ పర్ణం పెదబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, పార్టీ నాయకులు గొరిపర్తి రవికుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నగర కమిషనర్ చంద్రయ్యకు స్థానచలనం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తున్న జి.చంద్రయ్యను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు కార్పొరేషన్‌కు అడిషనల్ కమిషనర్‌గా ఈయనను బదిలీ చేసింది. ఏలూరు కార్పొరేషన్‌లో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్‌వీవీఎస్ బాపిరాజును ఇక్కడ కమిషనర్‌గా నియమించారు. ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న బి.జ్యోతిలక్ష్మి కడప మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ డెప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎన్‌వీ రమణారెడ్డిని ఇక్కడ డెప్యూటీ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది.

స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ సలహాదారు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేమని భాస్కరరావు శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.





గణతంత్ర దిన వేడుకలలో భాగంగా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్మలా కాన్వెంట్ విద్యార్థుల ప్రదర్శన



శాంతి కపోతాలను ఎగురవేస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా, జేసీ గీతాంజలిశర్మ

• ఘనంగా గణతంత్ర దిన వేడుకలు

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో శుక్రవారం గణతంత్ర దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు తమ కార్యాలయాల్లో జాతీయజెండాను ఎగురవేశారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన వేడుకలలో వివిధ శాఖలకు సంబంధించి ఉత్తమ అధికారులు, ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల పరిధిలో గణతంత్ర దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. -సాక్షి నెట్‌వర్క్



గణతంత్ర దిన వేడుకలలో ద్వితీయ బహుమతి పొందిన స్త్రీ,శిశు సంక్షేమశాఖ శకటం



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా



గృహనిర్మాణశాఖ శకటం ముందు నడుస్తున్న గృహప్రవేశాలు చేస్తున్న మహిళలు



పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా



గణతంత్ర దిన వేడుకల్లో చిన్నారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పేర్ని నాని

వాడవాడలా రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

- మహనీయుల త్యాగాల ఫలితమే స్వేచ్ఛా వాయువులు
- నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ
- నగరంలో ఘనంగా గణతంత్ర దిన వేడుకలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజక వర్గంలో 75వ గణతంత్ర దిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. నగరం నడిబొడ్డున ఉన్న కోనేరు సెంటర్ స్థూపం వద్ద నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం నాడు మహనీయులు చేసిన త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చగలుగుతున్నామన్నారు. నగర పాలక సంస్థ కార్యాయలం వద్ద కమిషనర్ జి.చంద్రయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు మేయర్ వెంకటేశ్వరమ్మ, కమిషనర్ చంద్రయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో, సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. నగరంలోని ఎల్ఐసీ, బెల్, తపాలా, బ్యాంక్‌లు, విద్యా సంస్థలు ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాల వద్ద ఆయా కార్యాలయాల అధికారులు, సచివాలయాల వద్ద ఆయా డివిజన్‌ల కార్పొరేటర్‌లు జాతీయ జెండాలను ఎగురవేసి మిఠాయిలు పంచారు. జిల్లా సర్వజన ఆస్పత్రి ఆవరణలో జాతీయ జెండాను సూపరింటెండెంట్ జీఎస్ రమేష్ కుమార్ ఎగురవేశారు. అంబేడ్కర్ సర్కిల్లోని భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మార్కెట్ యార్డ్ చైర్మన్ గాడెల్లి డేవిడ్‌శామ్యూల్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనంద్‌బాబు(జాని), ఎల్ఐసీ ఎస్సీ ఉద్యోగుల సంఘ నాయకుడు శోభన్ కుమార్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగ నాయకురాలు అనుపమ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా విశ్వవిద్యాలయంలో...

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలో ఉపకులపతి జి.జ్ఞానమణి జాతీయజెండాను ఆవిష్కరించారు. తొలుత జాతిపిత మహాత్మగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు వీసీ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.వీరబ్రహ్మచారి, ప్రిన్సిపాల్స్ సుందరకృష్ణ, విజయకుమారి, రాంబాబు, పలువురు ఆచార్యులు, సహాయ ఆచార్యులు, ఎన్‌సీసీ క్యాడెట్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోనేరుసెంటర్లో జాతీయ జెండాను ఎగురవేసిన మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, చిత్రంలో కమిషనర్ చంద్రయ్యతదితరులు

అవనిగడ్డలో ఘనంగా గణతంత్ర దినోత్సవం

అవనిగడ్డ: గణతంత్ర దినోత్సవాన్ని అవనిగడ్డలోని పలు ప్రాంతాల్లో ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో కూడా ఎమ్మెల్యే సింహాద్రి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పులిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఆర్టీసీ డిపో వద్ద డీఎం హనుమంతరావు, గాంధీక్షేత్రంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. మండల పరిధిలోని సాయి జ్ఞాన మందిరం వద్ద జరిగిన వేడుకల్లో గ్రామానికి చెందిన దివ్యాంగుడు గాజుల రాముడు(రాంబాబు) జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మందిర నిర్వాహకులు సింహాద్రి లక్ష్మి భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు.

కోడూరులో...



అవనిగడ్డలో పార్టీ కార్యాలయం వద్ద జాతీయ పతాకం ఎగుర వేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



జెండా వందనం చేసి మాట్లాడుతున్న ఎస్పీ జాషువా

కోడూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై శుక్రవారం త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఎమ్మార్సీ వద్ద ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ రాజేంద్రప్రసాద్, పాలకాయతిప్ప మెరైన్ పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ పవన్‌కిషోర్ జాతీయ పతాకాలను అవిష్కరించారు. పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల వద్ద కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది త్రివర్ణ పతాకాలను ఎగురవేశారు. పీఏసీఎస్ కార్యాలయాలు, విద్యాసంస్థలు వద్ద కూడా గణతంత్ర దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగాయలంకలో...



ఆర్‌టీవో కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఇన్‌చార్జ్ ఆర్‌టీవో కవిత, ఎంవీఐలు

నాగాయలంక: నాగాయలంక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ జాలాది విమలకుమారి జాతీయ జెండా ఆవిష్కరించారు.గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూజలు చేసి నివాళులర్పించారు. నాగాయలంక మండల పరిషత్ కార్యాలయం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తదితర చోట్ల జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో ఎంపీపీ భోగాది రాఘవారాణి, జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం పోలీస్‌స్టేషన్, స్కాలర్స్ హైస్కూలు, రక్షణసైన్యం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించారు. మండలంలోని పలు విద్యా సంస్థలలో గణతంత్ర దిన వేడుకలు జరిపారు.

ఘంటసాలలో...

ఘంటసాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ వేమూరి రజనీకుమారి, ఎంపీడీవో టి.అనూహ్య, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ బి.రామానాయక్, పెదగూడెంలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడాలి భక్తిపాల్, అమ్మానాన్న ట్రస్ట్ ప్రతినిధి కె దానియేల్, తెలుగురావుపాలెంలో సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు జాతీయ జెండాలను ఎగురవేశారు. తొలుత బీఆర్ అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

మోపిదేవిలో...

మోపిదేవి: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, సేవా సంస్థలు, పాఠశాలల్లో గణతంత్ర దిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి, మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

పోలీసు కార్యాలయాల్లో...

జిల్లా ఎస్పీ పి.జాషువా క్యాంపు కార్యాలయం, జిల్లా పోలీసు కార్యాలయాల్లో జాతీయజెండాలను ఎగురవేశారు. సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. స్పెషల్‌బ్రాంచ్ ఏఎస్పీ (అడ్మిన్) శ్రీహరిబాబు, ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో...

మచిలీపట్నం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సునీత జాతీయజెండాను ఎగురవేశారు. సిబ్బంది జెండా వందనం చేశారు. సిబ్బందికి స్వీట్లు పంచిపెట్టారు.

జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో...

జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డీటీసీ)లో జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీహరిబాబు జాతీయజెండాను ఎగురవేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో డీఎస్పీ రమేష్, సీఐ వెంకటనారాయణ, ఆర్ఐ శ్రీనివాసరావు, ఏఆర్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయంలో...

బందరు డీఎస్పీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీఎస్పీ యు.నాగరాజు జాతీయజెండాను ఎగురవేశారు. సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆర్‌టీవో కార్యాలయంలో...

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఆర్‌టీవో కవిత జాతీయజెండాను ఎగురవేశారు. సిబ్బందికి స్వీట్లు పంచిపెట్టారు ఎంవీఐలు ఎండి సిద్దిక్, ఏఎంవీఐలు సోనీప్రియ, సత్యనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

గూడూరులో...

గూడూరు: మండలంలో గణతంత్ర దిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.సుబ్బారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా ఎంపీపీ సంగా మధుసూదనరావు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, సర్పంచ్ లింగం సులోచన రాణి జెండా వందనం సమర్పించారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ పి.విజయ్‌ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం సమర్పించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లోను, సచివాలయాల్లోను, ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

చల్లపల్లిలో...

చల్లపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ చేకు చిన రాటాన్లు జాతీయ పతాకం ఆవిష్కరించారు. పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఘంటసాల కృష్ణ మోహన్ జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఏఎస్ఓ అఖిలా పర్వీన్, వీఆర్వోలు జెండా వందనం సమర్పించారు.

కృత్తివెన్నులో...

కృత్తివెన్ను:గణతంత్ర దిన వేడుకలను మండల వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ గరుడప్రసాద్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో జెడ్పీటీసీ రత్నకుమారి జాతీయ పతాకావిష్కరణలో పాల్గొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

త్యాగధనుల ఫలం గణతంత్ర దినోత్సవం

పెడన: ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా భారత ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించడానికి భారత రాజ్యాంగం అమలు చేసిన రోజు గణతంత్ర దినోత్సవమని, అటువంటి మహనీయులను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము)అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెడనలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాతీయ జెండాను మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారితో కలిసి ఉప్పాల రాము ఆవిష్కరించారు. తొలుత మహాత్మగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు మొహమ్మద్ ఖాజా, బైలపాటి జ్యోతి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు, పెడన పట్టణ సచివాలయాల కన్వీనర్ మతిన్ ఖాన్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

- పెడన తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు పి.మధుసూదనరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీటీ పూర్ణచంద్రరావు, ఆర్ఐ మణికుమార్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.
- జయలక్ష్మీ పీఏసీఎస్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, పీఏసీఎస్ చైర్మన్ వరుదు రామకృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- బంగ్లా స్కూలులో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ తదితరులు అందజేశారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఉప్పాల రాము

బంటుమిల్లిలో...

బంటుమిల్లి: బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వి.చినబాబు, జూనియర్ సివిల్ కోర్టులో న్యాయమూర్తి ఈ. సుధాకరరావు, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ఎ.పైడిబాబు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామ సచివాలయాలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, హెచ్ఎంలు, డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో ప్రిన్స్‌పాల్స్ జగన్‌మోహన్‌రావు, కృష్ణకిషోర్ మువ్వన్నెల పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చాక్లెట్లు పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, ఉపాధ్యక్షుడు ఓ.చిన్నారిబాబు, ఎంఈఓలు త్రిపురసుందరీదేవీ, వెంకటేశ్వరరావు, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

స్లాబ్ కూలి ముగ్గురికి తీవ్రగాయాలు

కృత్తివెన్ను: మండల పరిధిలోని చినపాండ్రాక పంచాయతీ పాశ్చాపురం ఓఎన్‌జీసీ సైట్‌లో నిర్మాణంలో ఉన్న స్లాబ్ కూలిపోవడంతో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు, మరి కొందరికి గాయాలైన సంఘటన శుక్రవారం ఉదయం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు ఓఎన్‌జీసీ సైట్‌లో రెండు అంతస్తుల భవనం స్లాబ్ పనులు జరుగుతుండగా కూలిపోవడంతో పని చేస్తున్న కార్మికులు గాయాలపాలయ్యారు. వీరిలో పులి నాగరాజు తలకు తీవ్ర గాయం కాగా, గోవాడ వంశీ, నరేష్‌ల కాళ్లు చేతులకు గాయాలయ్యాయి. వీరితో పాటు మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మచిలీపట్నం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. నిర్మాణ సమయంలో ఇరవై మంది కూలీలు పని చేస్తున్నట్లు తెలిసింది.

వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నేతలు

కోడూరు: చంద్రబాబు నమ్మినవారినే మోసం చేస్తాడనడానికి ఇటీవల జరిగిన రాజకీయ పొత్తుల వ్యవహారమే ఉదాహరణగా నిలుస్తోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. లింగారెడ్డిపాలెం శివారు జరుగువానిపాలెం గ్రామానికి చెందిన ఆరుగురు జనసేన నేతలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడికొండ సుబ్బారావు, అర్జునరావు, వెంకటేశ్వరరావు, తుంగల సుబ్బారావు, చందన గోపాల్, దేవరపల్లి గోపాల్‌శర్మలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సంక్షేమాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ఆసరా నాలుగో విడత నిధుల పంపిణీలో ఉప్పాల రాము, హారిక

పెడన: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమాభివద్ధి పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రమేష్(రాము)అన్నారు. పెడన మండలం చెన్నూరు జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం మధ్యాహ్నం నాలుగో విడత ఆసరా పథకం లబ్ధిదారులకు నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించిన పిమ్మట సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, అటువంటి వ్యక్తికి మనమంతా అండగా ఉందామన్నారు. పెడన మండలంలో 791 గ్రూపులకు 7,861 మంది సభ్యులకు నాలుగో విడత కింద రూ.6.80 కోట్లు విడుదలైనట్లు ఏపీ కనకారావు తెలిపారు.



డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు చెక్కు అందజేస్తున్న ఉప్పాల రాము, హారిక దంపతులు